క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కమలాపురం : క్రీడల్లో గెలుపోటములు సహజం అని ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, వీఎస్‌పల్లె మాజీ మండలాధ్యక్షుడు సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. అలాగే శారీరక దారుఢ్యానికి మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ప్రారంభించిన మొదటి మ్యాచ్‌లో కడపకు చెందిన సన్నీ లెవెన్ ప్రొద్దుటూరుకు చెందిన సీటీఐటీ జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ సునీల్, దినకర్, సుధీకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పులివెందుల రూరల్ : రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న ఎంవీఐ కార్యాలయ ఆవరణంలో లారీ, ఆటో, ట్రాక్టర్ల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదాలు, నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపైన వారికి అవగాహన కల్పించారు. వాహనదారులందరూ అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ముఖ్యంగా షీట్ బెల్టులు, హెల్మెట్లు ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చింది సీఎం జగనే

కమలాపురం : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సోమవారం 2వ వార్డులో ఇంటింటికి తిరిగి సీఎం ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమాన్ని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి పొందాలంటే త్వరలో ఎమ్మెల్యేగా రవీంద్రనాథ్ రెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని సీఎంగా వైఎస్ జగన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్ రెడ్డి, నిఖిల్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గఫార్, ఇస్మాయిల్, మస్తానయ్య, ఖాజా హుస్సేన్, షావలి, దేవదానం, శంకర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, మోనార్క్ జిలాన్, పుత్తా మధు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషి

జమ్మలమడుగు : పోలియో రహిత సమాజం కోసం అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీ ఓ కార్యాలయంలో పులివెందుల, జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని రూట్, సూపర్‌వైజర్లుతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 0-5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలను వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతి కళ కమ్యూనిటీ హెల్త్ అధికారి మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వేంపల్లె : విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ఎస్.లక్ష్మీగాయత్రి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.చంద్ర ఓబుళరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం మండలంలో మూడు సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి సుచికరమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి నాగేంద్ర రాజు, వెల్ఫేర్ అధికారి బి.రాజాబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాకు స్థలం కేటాయించాలని వినతి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల నగర పంచాయితీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన రాణీవనం ముస్లింలకు ఈద్గా స్థలం కేటాయించాలని ఆ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణను కలసి వినతి పత్రం అందించారు. ఈ వార్డులో దాదాపు 300 ముస్లిం కుటుంబాలు ఉన్నాయన్నారు. రంజాన్, బక్రీద్ పండుగలకు నమాజ్ చేసుకోవడానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉండే వలసపల్లి రోడ్డులోని ఈద్గా వద్దకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బిక్కుసాహెబ్, హసన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనం.. ఆహ్లాదభరితం



పులివెందుల గరండాల్ రివర్ ఫ్రంట్‌లో ప్రజల సందడి



పులివెందుల వైఎస్సార్ పార్కులోని ఓపెన్ జిమ్‌లో మహిళలు, చిన్నారులు



వేంపల్లె పార్కులోని సెల్ఫీ పాయింట్ వద్ద చిన్నారులు



పులివెందులలోని గరండాల్ రివర్ ఫ్రంట్ వ్యూ



సింహాద్రిపురం పార్కులోని లేజర్ షో

పులివెందుల : ఉరుకులు, పరుగుల జీవన విధానంలో ఒత్తిళ్లకు లోనై ప్రతి ఒక్కరి జీవితం గజిబిజి గందరగోళంగా మారింది. ఈ క్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు, చిన్నారులు, మహిళలు అలాంటి జీవనం నుంచి బయట పడేందుకు.. ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకర వాతావరణం, పచ్చని ప్రదేశాలలో గడిపేందుకు ఆసక్తి చూపేవారు. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారింది. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా తమ సొంత ప్రాంతాల్లోనే అన్ని హంగులతో ప్రభుత్వం ఉద్యాన వనాలను సుందరంగా తీర్చిదిద్దింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించారు. అందులో భాగంగా ఎంపీ సూచనలకు అనుగుణంగా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పులివెందుల పట్టణం, వేంపల్లె, సింహాద్రిపురం మండల కేంద్రాలలో అన్ని వర్గాల ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు అన్ని సదుపాయాలతో పార్కులను నందనవనాలుగా సుందరీకరించే పనులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఇంటికి సమీపంలోనే..

వాకింగ్ చేయాలంటే ఒకప్పుడు రోడ్డుపైన, పొలాలు, మైదానాల వద్దకు వెళ్లే పరిస్థితి ఉండేది. దీంతో మహిళలు వాకింగ్‌పై ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు తాము నివసిస్తున్న ప్రాంతంలోనే పార్కులు అందుబాటులోకి రావడంతో చిన్నారులను వెంట బెట్టుకుని మహిళలు వారికి నచ్చిన పార్కులకు వెళుతున్నారు. అక్కడే ఓపెన్ జిమ్‌లు ఉండటం, పిల్లలు ఉత్సాహంగా ఆడుకునేందుకు ఆట పరికరాలు ఉండటంతో వీకెండ్‌లో బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజల మానసికోల్లాసం కోసం పార్కులను తీర్చిదిద్దారు.

అందుబాటులో పచ్చదనం

ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు పులివెందుల పట్టణంలోని సిటీ ఫారెస్ట్(రాణితోపు), గరండాల్ రివర్ ఫ్రంట్, మైత్రి లే అవుట్ వద్ద వైఎస్సార్ పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయా పార్కులలో వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్, ఓపెన్ జిమ్, రాణితోపులో హార్స్ రైడింగ్ సదుపాయం కల్పించారు. ఇందులోనే ప్రకృతిని ఆస్వాదిస్తూ చిరుధాన్యాలతో తయారు చేసిన అల్పాహారం అందుబాటులో ఉండేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే గరండాల్ రివర్ ఫ్రంట్‌లో ఓపెన్ థియేటర్, ఓపెన్ జిమ్, ప్లే ఏరియాను సుందరంగా తీర్చిదిద్దారు. వీటితోపాటు పులివెందుల పట్టణంలోని మైత్రి లే అవుట్ వద్ద ఉన్న వైఎస్సార్ మెమోరియల్ పార్కు, వేంపల్లె, సింహాద్రిపురంలోని పార్కులు ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు, యువతను ఆకర్షించేలా గజీబ్‌లు, వాటర్ ఫౌంటైన్లు, ప్లే ఏరియా, ఆకట్టుకునే విగ్రహాలను ఏర్పాటు చేసి పార్కులను అద్భుతంగా సుందరీకరించారు.

అబ్బుర పరిచేలా శిల్పారామం

గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా శిల్పారామం సేవలు వైఎస్సార్ హయాం నుంచి కొనసాగుతున్నాయి. దీన్ని మరింత ఆధునికీకరించారు. అందులోనే ప్రస్తుతం మరికొన్నింటిని ఏర్పాటు చేయించి యువకులు, చిన్నారులకు మరింత ఆకర్షణీయంగా జిప్‌లైన్, వాటర్ లేజర్ షో, ఓపెన్ జిమ్, వివిధ రకాల ఆటల పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో చిన్నారులు, యువత వారాంతంలో వీటిని సందర్శించి మంచి అనుభూతిని పొందుతున్నారు.

ఫొటోసూట్ కేంద్రాలు

సిటీ ఫారెస్ట్ (రాణితోపు), వైఎస్సార్ మెమోరియల్ పార్కు, శిల్పారామంలో ప్రత్యేకంగా నేటి యువతకు బాగా కనెక్ట్ అయ్యేలా సెల్ఫీ పాయింట్లు, ఫొటో షూట్లు ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కువ మంది యువతను ఆకర్షిస్తున్నాయి. చిన్న, చిన్న సెలబ్రేషన్లకు ఈ పార్కులు వేదికలుగా మారి సంతోషాలకు నిలయంగా మారుతున్నాయి.

మానసిక ఒత్తిళ్లు దూరం

శ్రమలేని జీవన విధానంతో ఎక్కువ మంది జీవనశైలి వ్యాధులైన మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బారినపడుతున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్, ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి రావడంతో యువత, చిన్నారులు, మహిళలు వీటిని చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. వాకింగ్, వ్యాయామం చేస్తూ ఆరోగ్య జీవనానికి అలవాటు పడుతున్నారు. ఇది పట్టణ ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. పచ్చని మొక్కల మధ్య వాకింగ్ చేయడం వల్ల మానసిక ఉల్లాసంతోపాటు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుంది. తద్వారా హ్యాపీ హార్మోన్ రిలీజ్ అయ్యి మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయి.

- డాక్టర్ నవీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీఎంసీ, పులివెందుల

కమనీయం.. వీరభద్రస్వామి కల్యాణం



భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం కనుల పండువలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులతో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి భస్మాలంకరణ చేశారు. సాయంత్రం వీరభద్రస్వామి గ్రామోత్సవం బ్యాండు వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. కాంతారా వేషధారణ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అలాగే వీరభద్రస్వామి వేషదారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం ఉదయం స్వామి వారికి విశేష పూజల అనంతరం మహా కుంభ నివేదన నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థికాభివృద్ధి



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లను ప్రజలకు అందిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెంకటాపురం సచివాలయ పరిధిలోని ఎర్రగుడిపల్లె తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఎంత లబ్ధి పొందారో ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని.. అలాంటి నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరింత ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. ప్రజలే ఆయన బలమని.. వారిని నమ్ముకుని వారి మేలు కోసం ముందుకెళుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, వార్డు కౌన్సిలర్ పురుషోత్తం, విజయ్ నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్, సూరి, కృష్ణమూర్తి, డేనియల్ బాబు, గిరి, చంద్రమోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అర్బన్ సీఐ శంకర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : వాస్తవాలను వక్రీకరించి అంబేడ్కర్ విగ్రహంపై అవాస్తవాలు దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు సూరి, డేనియల్ బాబు, కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్ సీఐ శంకర్‌రెడ్డికి వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందుల సుందరీకరణలో భాగంగా అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ విషయంలో టీడీపీ వారు, కొన్ని యూట్యూబ్ చానెళ్ల వారు వక్రీకరించి చేసిన ప్రచారాన్ని ఖండిస్తున్నామని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, నాగరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చక్రాయపేట : ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసూధన్ పేర్కొన్నారు. మండలంలోని చెరువుకాంపల్లెలో జరుగుతున్న నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజల ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, హైజనిటి లిక్విడ్‌లను పంచి పెట్టారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు అసోసియేట్ అకడమిక్ డీన్ వీరరాఘవరెడ్డి, ప్రోగ్రాం అధికారులు రమేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్ల తొలగింపు



కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

కమలాపురం : మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె - లేటపల్లె ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు దాదిరెడ్డిపల్లెలో ఆ గ్రామ నాయకుడు చెన్నారెడ్డి, ఎమ్మెల్యే పీఏ కిషోర్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సాయంతో దాదిరెడ్డిపల్లె - లేటపల్లె ప్రధాన రహదారితోపాటు పంట పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లను తొలగించారు. ఎన్నో ఏళ్లుగా ప్రధాన రహదారికి ఇరువైపు కంపచెట్లు మొలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముద్దనూరు తహసీల్దారుగా సువర్ణదేవి

ముద్దనూరు : మండల తహసీల్దారుగా సువర్ణ దేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. వారంరోజుల క్రితం ముద్దనూరు తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు అకస్మికంగా బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో సువర్ణదేవిని నియమించడంతో ఆమె విధుల్లో చేరారు.

బోగస్ ఓట్లపై విచారణ జరపండి



ఆర్డీఓ కార్యాలయ ఏఓ రవికుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నమోదైన బోగస్ ఓట్లపై విచారణ చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కార్యాలయ ఏఓ రవికుమార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు వినతి పత్రం అందించారు. చిరునామాతో సంబంధం లేని కొత్త వ్యక్తులను ఓటర్లుగా నమోదు చేశారని.. వాటిని నమోదు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, నాగరాజు, సుభాష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జమ్మలమడుగు : ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు బస్సు సర్వీసులపై ఉన్న సమస్యలు పరిష్కరించడం, ఆర్టీసీ ద్వారా మరిన్ని సేవలు అందించడం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు పి.వి. ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో సమస్యలను తెలయజేవచ్చన్నారు. ప్రయాణికులు, 9959225778 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో బాగా చదివి పరీక్షలు రాయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి పి.సనవుల్లా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో పాఠశాల హెడ్మాస్టర్ గంగిరెడ్డి అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి.సనవుల్లా మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలిచి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగుతాయని ఎమ్మెల్యేడాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఐదవ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన నవరత్నాలలో భాగంగా వచ్చే సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధి పొంది ఉంటే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించాలని, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆయన ప్రజల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తికి చెందిన వాడిని. తనకు ప్రాణం పోయాడమే తప్ప ప్రాణాలను తీయడం తెలియదన్నారు. గతంలో ఉన్న నాయకులు ఫ్యాక్షన్ ను ప్రొత్సహించి ఎప్పుడు ఎమి జరుగుతుందో అంటూ ప్రజలు భయపడేవిధంగా పాలన సాగిస్తు వచ్చారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాలుగున్నర సంవత్సరాల కాలంలో చిన్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. ప్రజలు ప్రశాంతమైన జీవితం గడపాలని కోరుకుంటున్నానని తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నారు. వారికందరికీ ఏడాదికి రూ. 24వేలు వైఎస్సార్ నేతన్ననేస్తంతో పాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులను పెన్షన్‌ను జగనన్న ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, ఐదో వార్డు ఇన్‌చార్జీ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కెకె రమణారెడ్డి, కులాయ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ రమణారెడ్డి, కౌన్సిలర్లు పోచిరెడ్డి, కిరన్,గౌరీనాథ్‌రావు, కోఆప్షన్ సద్యుడు ఫయాజ్, మార్బల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాలు ప్రారంభం



యామవరంలో విలేజ్‌క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముద్దనూరు : మండలంలోని యామవరం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నూతన భవనాలను ప్రారంభించారు. సుమారు రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే 28 మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాలమునిస్వామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌లో భద్రతా నియమాలు పాటించాలి



జ్యోతి వెలిగిస్తున్న యురేనియం ప్రాజెక్టు జీఎం ఎం.ఎస్.రావు

వేముల : యురేనియం మైనింగ్‌లో పని చేసే కార్మికులు భద్రతా నియమాలు పాటించాలని యురేనియం ప్రాజెక్టు జీఎం ఎం.ఎస్.రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు మైనింగ్‌లో భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ వారోత్సవాలు 18వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మలపల్లె యురేనియం మైనింగ్‌కు ఇప్పటికే రెండు సార్లు జాతీయ భద్రతా అవార్డులు సాధించామన్నారు. భద్రతను ఏవిధంగా పాటించాలనే విషయాలపై నమూనాలను తయారు చేసి సులువుగా అర్థమయ్యేలా వివిధ శాఖల వారు ప్రదర్శించారు. మైనింగ్‌లో పని చేస్తున్న కార్మికులు ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా పనులు చేయాలన్నారు. అంతకముందు భద్రతా వారోత్సవాలను ప్రారంభిస్తూ జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ కంపెనీ సీఈఓ ఖలీల్, యురేనియం అధికారులు చటర్జీ, శ్రీకాంత్, మోహన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎంఎస్ సిబ్బంది, మైనింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం



తలపనూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని యు.రాజుపాలెం, ఇందుకూరు, వెల్దుర్తి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలు, తలపనూరు గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామాల రూపురేఖలు మారాయని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలను పరిష్కరించుకునేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడం, విత్తనాలు కొనుగోలు, పంట విక్రయించేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలు తీసుకొచ్చామన్నారు. ఆరోగ్యపరంగా ఏమైనా సమస్యలు తలెత్తితే వారికి అక్కడే గ్రామాల్లోనే వైద్యం అందించేందుకు ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని అందుబాటులో తెచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని స్పష్టం చేశారు. అంతే కాకుండా ప్రతి 50 కుటుంబాలకు ఒక్క వలంటీర్‌ను నియమించి ప్రజలకు ప్రభుత్వ సేవలను గడప వద్దనే ఇస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగనంత అభివృద్ధి వైఎస్సార్ ప్రభుత్వంలో జరిగిందని తెలియజేశారు. ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామం వద్ద ఉన్న వాగు వలన ప్రతి ఏడాది వర్షాకాలంలో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారని గత ఏడాది వాగులో ఇద్దరు వ్యక్తులు ఇరుక్కుపోవడంతో విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.55లక్షలతో వంతెన నిర్మించామన్నారు. అంతే కాకుండా బసిరెడ్డిపల్లె, వెల్దుర్తి గ్రామాల మధ్య వాగు ఉండటం, రహదారి సక్రమంగా లేకపోవడంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రూ.2కోట్లతో వంతెన నిర్మించడంతోపాటు బీటీ రోడ్డు వేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేశామన్నారు. అభివృద్ధి అంటే తెలుగుదేశం నాయకులకు తెలుసా అని ఎద్దేవా చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని నిత్యం ఆరాటపడే వ్యక్తి సీఎం జగన్ అని సీఎంకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌కు మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు ఉరకలు వేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్, సివిల్ సప్లై డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, రోజారమణి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, తంగెడుపల్లె ఎంపీటీసీ వీరభద్రారెడ్డి, వెల్దుర్తి సర్పంచు విశ్వనాథ్, స్థానిక నాయకులు సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటేసు, రమేష్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఉత్తమరెడ్డి, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్షుమయ్య, గుర్రయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.